

జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

న్యూస్‌రీల్

18న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని భూకొలతల శాఖ కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం 10.30 గంటలకు రెండో బ్యాచ్ కోసం ఎంపిక చేసిన 83 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా భూకొలతల అధికారి సోమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ నిజ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఒక జత జిరాక్స్‌లతో సకాలంలో హాజరు కావాలని సూచించారు. ప్రభుత్వ వైద్యాధికారితో ధ్రువీకరించిన ఫిజికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

గోల్కొండ పరేడ్‌లో ఏఎస్పీ చిత్తరంజన్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సెల్యూట్ చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గోల్కొండ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పరేడ్‌కు ఆసిఫాబాద్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చిత్తరంజన్ నేతృత్వం వహించారు. తెలంగాణ కేడర్ 2022 బ్యాచ్‌కు చెందిన చిత్తరంజన్ గతేడాది సెప్టెంబర్ 17న జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పరేడ్‌కు కూడా కమాండర్‌గా వ్యవహరించి.. నాయకత్వం, డ్రిల్ నైపుణ్యాలకు ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ ఏఎస్పీగా పనిచేస్తూ ప్రజా కేంద్రిత పోలీసింగ్ విధానం, జిల్లా ఉప విభాగంలోని గిరిజన యువతతో సన్నిహిత సంబంధాలు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నారు. తిర్యాణి పాత పోలీస్ స్టేషన్‌ను ప్రజా గ్రంథాలయంగా, పాత వాంకిడి పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని ఆటస్థలంగా మార్చారు. పశువుల అక్రమ రవాణా, అక్రమ వడ్డీ వ్యాపారం, నిషేధిత గంజాయి సాగు రవాణా, వ్యాపారం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా అటవీ పరిసర గ్రామాల్లో గంజాయి సాగును నిర్మూలించేందుకు దీర్ఘకాలిక ప్రచారాలు చేపట్టారు.

నేడు బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల ద్వారా జిల్లా జట్లకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 24 వరకు గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరిగే తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు షార్ప్ స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు(98666 52249)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం



ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): కొత్త గనుల ఏర్పాటుతో బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం రానుందని ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన వేదిక శిలాఫలకం ఆవిష్కరించారు. ఏరియాలో ఉత్తమ కార్మికులుగా ఎంపికైన వారిని సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. జీఎం మాట్లాడుతూ గోలేటి, మాదారం ఉపరితల గనుల ఏర్పాటు ద్వారా ఏరియాకు పూర్వవైభవం రానుందన్నారు. ఉద్యోగుల కుటుంబాల కోసం ఐదు కొత్త బోరుబావుల ద్వారా సురక్షిత నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఏరియాకు నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటివరకు 95 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. కార్యక్రమాల్లో సేవా అధ్యక్షురాలు పద్మ విజయ భాస్కర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఎస్‌వోటూ జీఎం రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి

- ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు
- ఆహార భద్రతకు రాష్ట్రంలోని పేదలకు సన్నబియ్యం పంపిణీ
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా స్వాతంత్ర్య సంబురాలు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

ఆసిఫాబాద్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతుందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య సంబురాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్ బాబు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన బండ ప్రకాశ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ప్రగతిని చదివి వినిపించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. 70 ఏళ్లుగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తుందని, అదే స్ఫూర్తితో ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రూ.13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.

రైతు రుణమాఫీ



గతేడాది ఆగస్టు 15న రైతు రుణమాఫీ పథకం ప్రారంభించి రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ రైతుభరోసా కింద ఎకరాకు రూ. 12 వేల పెట్టుబడి సాయం ప్రకటించామన్నారు. జూన్ 16న ప్రారంభించి కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. రైతుబీమా పథకం కింద 501 మంది రైతుల నామినీలకు రూ.5 లక్షల చొప్పున రూ.25.05 కోట్లు ఖాతాల్లో జమ చేశామని వివరించారు.

శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం




తొలివిడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున మంజూరు చేశామని, ప్రస్తుతం శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకోసం రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఈ ఏడాది మార్చి 17న శాసన సభలో ఆమోదించామని పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలో 11,997 మంది పేదలు వైద్య చికిత్స పొందారన్నారు. గృహజ్యోతి కింద జిల్లాలోని 72,817 కుటుంబాలకు రూ.31.58 కోట్లు రాయితీ కల్పించామని తెలిపారు.



పదో తరగతిలో జిల్లా ఫస్ట్‌ర్యాంకు సాధించిన విద్యార్థికి చెక్కు ఇస్తున్న బండ ప్రకాశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, అధికారులు

సోలార్ పవర్ ప్లాంట్ కోసం స్థలం గుర్తింపు



ఇందిర మహిళా శక్తి పథకం కింద రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని 4 గ్రామ సంఘాల పరిధిలో ఎనిమిదెకరాల ప్రభుత్వ భూమిని సోలార్ పవర్ ప్లాంట్ కోసం గుర్తించి ప్రభుత్వం నుంచి రూ.40 లక్షలు మంజూరు చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదు మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 914 స్వయం సహాయక సంఘాలకు రూ.58.11 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని 727 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి 'భూభారతి'

రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 14న భూభారతి నూతన చట్టాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 356 దరఖాస్తులు రాగా, 148 పరిష్కరించామన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 35 లక్షల మొక్కలు నాటామన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 51 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా 62 శాతంతో 31 లక్షలు నాటడం పూర్తయిందని హర్షం వ్యక్తం చేశారు. ఎకో టూరిజం కింద గ్రామీణులకు ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు.

61 వేల కుటుంబాలకు 'ఉపాధి' పనిదినాలు



గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 61 వేల కుటుంబాలకు రూ.21.14 వేల పని దినాల పని కల్పించామన్నారు. కూలీలకు రూ.48.53 కోట్లు చెల్లించడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.10.58 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. జిల్లాలోని 973 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్యలక్ష్మి పథకం కింద 8,568 మంది గర్భిణులు, బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నామన్నారు. ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద 450 మంది దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించామని వెల్లడించారు. రాష్ట్రంలోని మూడు ఆస్పిరేషనల్ జిల్లాల్లో ఒకటైన కుమురం భీం ఆసిఫాబాద్‌లో ఇందిరమ్మ అమృత పథకం కింద 14 నుంచి 18 ఏళ్ల గల 18,230 మంది కౌమర బాలికలకు పల్లీలు, చిరుధాన్యాలతో తయారు చేసిన చిక్కీలు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలోని 74 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 2,950 మంది సభ్యులు ఉండగా 2024- 25 సంవత్సరానికి 47.38 లక్షల ఉచిత చేపపిల్లలు సరఫరా చేసినట్లు తెలిపారు. 2025- 26 సంవత్సరానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 188 మంది విద్యార్థులకు రూ.6.25 లక్షలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా 1,297 మంది విద్యార్థులకు రూ.2.28 లక్షలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 279 మందికి ఎంటీఎఫ్, ఆర్టీఎఫ్ కింద రూ.4.92 కోట్లు ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాను ప్రగతిపథకంలో నడిపించి, అభివృద్ధి కోసం ఎల్లవేళలా అంకిత భావంతో పనిచేస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.



భరతమాత వేషధారణలో విద్యార్థిని

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య వేడుకల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్యాలతో అలరించారు. వాంకిడి కస్తూరిబా గాంధీ విద్యాలయం బాలికలు విన్యాసాలు చేశారు. గిరిజన బాలికల కళాశాల విద్యార్థినులు 'ఇదే మా భారతం' అనే పాటకు డ్యాన్స్ చేశారు. బాలికల ఉన్నత పాఠశాల, ఆదర్శక్రీడా పాఠశాల, ఇతర ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు గోండి పాటలకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, డీపీవో భిక్షపతి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు



విద్యాశాఖ స్టాల్ పరిశీలిస్తున్న ప్రకాశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ, పశువైద్య, జిల్లా గ్రామీణాభివృద్ధి, పట్టు పరిశ్రమ, వైద్య, అటవీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 346 మహిళా సంఘాలకు రూ.21.71కోట్ల చెక్కు అందించారు.



వాంకిడి కేజీబీవీ విద్యార్థినుల విన్యాసాలు



సాంస్కృతిక నృత్యం చేస్తున్న ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అమరుల త్యాగాలను స్మరిద్దాం



జెండా ఎగురవేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య పోరాటంతో ఎందరో మహానుభావులు జీవితాలు, ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి అమరులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలన్నారు. సమాజంలో శాంతిభద్రతలు లేకుండా నిజమైన స్వేచ్ఛను అనుభవించలేమని తెలిపారు. ప్రతీ పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధత చూపాలని సూచించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన తొమ్మిది మంది పోలీసు అధికారులకు సేవా పతకాలు అందించి అభినందించారు. కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్, ఆసిఫాబాద్ ఎస్సై శ్రీనివాస్, భరోసా సెంటర్ మహిళా ఎస్సై తిరుమల, కాగజ్‌నగర్ ఏఎస్సై బాలాజీ, హెడ్ క్వార్టర్ ఏఎస్సై శ్రీనివాస్, హెడ్ క్వార్టర్ హెడ్ కానిస్టేబుల్ ఇమామ, బిశ్వజిత్ మాగి, సిర్పూర్ హెడ్ కానిస్టేబుల్ అజీమొద్దీన్, ఏఆర్ హెడ్‌క్వార్టర్ నాందేవ్ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- డీఎఫ్‌వో నీరజ్‌కుమార్



రక్తదానం చేస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: విధి నిర్వహణతోపాటు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఆసిఫాబాద్ ఎఫ్‌డీవో దేవిదాస్ అధ్యక్షతన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్‌తో కలిసి రక్తదానం చేశారు. అటవీశాఖలో విధులు ఎన్నో సవాళ్లతో కూడుకుందన్నారు. వాటిని అధిగమిస్తూనే ప్రజలకు సేవ చేయాలని సూచించారు. రక్తదాన శిబిరంలో 62 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అజ్మత్, రేంజ్ అధికారులు గోవింద్‌చంద్ సర్దార్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ఝాన్సీరాణి, చంద్రమోహన్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలు



జెడ్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు



జిల్లా గ్రంథాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కోర్టు ఆవరణలో జెండా వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జిల్లా గ్రంథాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా న్యాయస్థానంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రియాజ్ అహ్మద్, ఎమ్మెల్యే క్యాంపు, బీఆర్‌ఎస్ కార్యాలయాల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చైతన్య కళాశాలలో నాగేశ్వర్‌రావు, ఏఎంసీ కార్యాలయంలో కార్యదర్శి అశ్ఫక్ అహ్మద్, వివేకానంద చౌక్‌లో దివ్యాంగుడు వెంకటేశ్వర్లు, పొట్టి శ్రీరాములు చౌక్‌లో వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ కార్యాలయం, గాంధీ చౌక్‌లో మున్సిపల్ కమిషనర్ గజానంద్, శిశుమందిర్‌లో మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకన్న, ఆర్‌ఎంపీ వైద్యుల సంఘం, బీసీ సంఘం కార్యాలయాల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ జెండా ఎగురవేశారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి



వరదతో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు

దహెగాం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పెద్ద వాగు, ఎర్రవాగు పరీవాహక ప్రాంతాల్లో పత్తి, వరి పంటలు వరదతో పూర్తిగా కొట్టుకుపోయాయని, ప్రభుత్వం సర్వే నిర్వహించి ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం అందించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. దహెగాం మండలం గిరవెల్లి, కర్జి తదితర గ్రామాల్లో వరదలతో దెబ్బతిన్న పత్తి పంటను శుక్రవారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పెద్దవాగు, ఎర్రవాగులు ఉప్పొంగడంతో వరదతో పత్తి నీట మునిగిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ స్పందించి సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని కోరారు. కర్జి చెరువు మత్తడి తెగి ఐదేళ్లవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరంతా వృథాగా పోతుందన్నారు. దహెగాం మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్లు సక్రమంగా లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో ఆస్పత్రికి చేరకపోవడంతో లోహ గ్రామానికి చెందిన మడే రమాదేవి పాముకాటుకు గురై మృతి చెందిందని తెలిపారు. ఆయన వెంట నాయకులు లెండుగురే శ్యాంరావ్, దందెర మల్లేశ్, మనోహర్, అంజన్న తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

భీమారంలో తలకిందులుగా జెండా



తలకిందులుగా జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం 9గంటలకు తహసీల్దార్ సదానందం తలకిందులుగా ఉన్న జాతీయ జెండా ఎగురవేశారు. ఆ తర్వాత అందరూ జాతీయ గీతం ఆలపిస్తుండగా జెండా తలకిందులుగా ఎగిరినట్లు పక్కనున్న వ్యక్తి తెలుపగా వెంటనే కిందికి దించారు. సరిచేసి మరోసారి జెండాను ఎగురవేశారు.

ముగ్గురికి జైలు శిక్ష

చెన్నూర్: మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి స్థానిక మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి పర్వతపు రవి జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. గుడుంబా తయారీ కేసులో పట్టుబడిన నాగావతు రాజేశ్, బానోతు సావిత్రి, రాజేశ్వరి కోర్టుకు హాజరు కాకపోవడంతో శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.జీ మేరకు శుక్రవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్‌కు చెందిన కుక్కల రాకేశ్ (21) ఇద్దరు స్నేహితులతో కలిసి నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి రామకృష్ణాపూర్‌కు కారులో వస్తుండగా హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని వేంపల్లి శివారులోగల కల్వర్టును అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యా యి. మృతుడికి వివాహం కాలేదు. అతని తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్



స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోగల మసీదు ఎదురుగా నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని శుక్రవారం వేకువజామున నిర్మల్ నుంచి మెట్‌పల్లి వైపు అరటిపండ్ల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కూలి స్తంభం వంగింది. వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభకు ప్రశంస



కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు ప్రశంసాపత్రం ఇస్తున్న బండ ప్రకాశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాసన మండలి చైర్మన్ బండ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ చూపిన 125 మంది అధికారులు, సిబ్బందికి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, అధికారులతో కలిసి ఆయన ప్రశంసాపత్రాలు అందించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతోపాటు డీటీడీవో రమాదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సజీవన్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తదితరులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



రమాదేవి, డీటీడీవో | సజీవన్, బీసీ సంక్షేమ శాఖ అధికారి | శేషారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ | రామానుజం, డీఎస్పీ కాగజ్‌నగర్ | లక్ష్మిరాజ్యం, ఏఈ, ఆసిఫాబాద్ | నదీం, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి



సత్యనారాయణ, సీఐ, వాంకిడి | శ్రీనివాస్, డీపీవో కార్యాలయం | రుకియా సుల్తానా, కానిస్టేబుల్ | కార్తీక్‌యాదవ్, ఫైర్‌స్టేషన్ ఎస్సై | నాగరాజు, ఫైర్‌మెన్, కాగజ్‌నగర్ | భీంరావు, వీవోఏ, కౌటాల | మార జ్యోతి, ప్రోగ్రాం యాంకరింగ్ | కటుకం మధుకర్, జిల్లా సైన్స్ అధికారి | బామ్మె శేఖర్, మున్సిపల్ కార్మికుడు | రాంచందర్, ఆర్టీవో, ఆసిఫాబాద్



భాగ్య, కేజీబీవీ కోఆర్డినేటర్ | ధీరజ్, సీనియర్ అసిస్టెంట్, | ఊశన్న, ప్రోగ్రాం యాంకరింగ్ | సాయికృష్ణ, కమ్యూనికేషన్ పీసీ | తిరుపతి, ఎంవీఐ, ఆసిఫాబాద్ | సంజీవ్, టాస్క్‌ఫోర్స్ పీసీ | రవి కిరణ్, ఎస్సై, జైనూర్ | సంపత్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ రైటర్ | రాజేశ్, ఏఆర్ కానిస్టేబుల్ | దుర్యోధన్, డీపీవో, కానిస్టేబుల్



స్వప్న, షీటీం కానిస్టేబుల్ | మహేశ్, స్పెషల్ పార్టీ పీసీ | శేఖర్, ఏఆర్ ఎస్సై | సందీప్, ఆర్ఎస్సై | మల్లేశ్, సమగ్ర శిక్ష ఉద్యోగి | సందీప్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై | నాగన్న, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ | పూర్ణచందర్, పీసీ, ఆసిఫాబాద్ | చరణ్, డీసీఆర్‌బీ పీసీ

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ముందుగా పీవో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం, అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. 934 ప్రాథమిక పాఠశాలల్లో 12,017 మంది విద్యార్థులు చదువుతుండగా 1,449 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు తెలిపారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 31,749 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి పెంచిన చార్జీల ప్రకారం నూతన ఆహార మెనూ అమలు చేస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు మినీ బాలికల గురుకులాలు, నాలుగు ఏకలవ్య పాఠశాలలు (కో–ఎడ్యుకేషన్), ఎనిమిది అప్‌గ్రేటెడ్ బాలికల జూనియర్ కళాశాలలు, నాలుగు అప్‌గ్రేటెడ్ జూనియర్ కళాశాలలు, ఒక బాలుర జూనియర్ కళాశాల, ఒక బాలికల జూనియర్ కళాశాల, రెండు మహిళా డిగ్రీ కళాశాలలు, ఒక పురుషుల డిగ్రీ కళాశాల ఉన్నట్లు



జెండాకు వందనం చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే బొజ్జు

తెలిపారు. గురుకులాల్లో 11,114 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 32 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉప కేంద్రాలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటి ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 42 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. భూబదలాయింపు చట్టం కింద ఈ సంవత్సరం 25



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కేసులు నమోదు చేసి 12 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగతా 13 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలో గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, మంజూరైన 11 పెట్రోల్ పంపులను ప్రారంభించి నిరుద్యోగ గిరిజన యువతీయువకులకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. మిగతా ఆరు పంపులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏవో దామోదరస్వామి, ఏడీఎంహెచ్‌వో మనోహర్, పీహెచ్‌వో సందీప్, పీవీటీజీ ఏపీవో మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, ఆశ్రమ, గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడ్డందుకు చితకబాదిన ఎస్సై!

- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు

వేమనపల్లి: భార్యతో గొడవపడ్డందుకు తనను ఎస్సై చితకబాదాడని మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన అల్లం కిష్టయ్య ఆరోపించాడు. ఈ మేరకు ఎస్సైపై ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశంతో కలిసి సీపీ, డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సుంపుటం గ్రామానికి చెందిన అల్లం కిష్టయ్య నాలుగేళ్ల క్రితం నీల్వాయి కొత్త కాలనీకి చెందిన భారత ప్రమీలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ప్రమీల పుట్టింటికి వెళ్లడం, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన అనంతరం తిరిగి కాపురానికి రావడం జరుగుతుండేది. 20 రోజుల క్రితం అనారోగ్యంతో ప్రమీల పుట్టింటికి వెళ్లింది. దీంతో కిష్టయ్య గత ఆదివారం ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రావాలని గొడవ పడ్డాడు. దీంతో ప్రమీలతోపాటు ఆమె తల్లిదండ్రులు నీల్వాయి



బాధితుడు కిష్టయ్య

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సురేశ్ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేశాడు. అయితే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశ్ ద్వారా రూ.10వేలు ఇవ్వాలని ఎస్సై తనను డిమాండ్ చేసినట్లు కిష్టయ్య ఆరోపించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తన భార్య, అత్తమామలు, మరికొందరి ముందే ఎస్సై తనను రోకలిబండతో తీవ్రంగా కొట్టాడని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ విషయమై మూడురోజుల క్రితం రూరల్ సీఐ బన్సీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. శుక్రవారం రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీకి పోస్టు ద్వారా ఫిర్యాదు కాపీ పంపించినట్లు పేర్కొన్నాడు. ఎస్సై సురేశ్‌తో తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. తనపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

సైగలతో నృత్యం చేసి.. అందరి మెప్పు పొంది..

ఉట్నూర్‌రూరల్: వైకల్యమున్నా తాము అనుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదని నిరూపించారు దివ్యాంగ విద్యార్థులు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐటీడీఏ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వికాసం ప్రత్యేక బాలబడి విద్యార్థులు డ్యాన్స్ ఉపాధ్యాయుడు చేస్తున్న సైగలను చూసి వేస్తున్న స్టెప్పులు అందరినీ అలరించాయి. అధికారులు, విద్యార్థుల కేరింతలతో ఐటీడీఏ ప్రాంగణం హోరెత్తింది. ఉపాధ్యాయుడు, విద్యార్థులను ఎమ్మెల్యే బొజ్జు, పీవో ఖుష్బూ గుప్తా అభినందించారు.



‘హమాలీల సమస్యలు పరిష్కరిస్తా’




మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి: హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీ సంఘం నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం మాట్లాడుతూ.. హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అసంఘటిత కార్మికుల మాదిరిగానే పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం హమాలీలు పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతకుముందు బజారు ఏరియా ప్రాంతం నుంచి పుర వీధుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు, నియోజకవర్గ అధ్యక్షులు, హమాలీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాటాగూడలో తొలిసారి ఎగిరిన జెండా

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని పాటాగూడ గ్రామంలో తొలిసారి జాతీయ జెండా రెపరెపలాడింది. ఇది మారుమూల గ్రామం కావడంతో ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని



జెండా ఎగురవేస్తున్న సీఆర్టీ చంద్రకళ

మారుమూల ప్రాంతంలో ఉంటుంది. అప్పుడప్పుడు ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. అవి కూడా వెళ్లని పక్షంలో వారికి కాలినడకే శరణ్యం. ఆ గ్రామంలో ఇప్పటివరకు బడి, అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో ఇప్పటివరకు జెండా ఎగురవేయలేదు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చొరవతో ఇటీవల గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు. ఇందులో 14 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం పాఠశాలలో సీఆర్టీ చంద్రకళ త్రివర్ణపతాకం ఎగురవేశారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తంజేశారు.

అభినవ పోతన.. వరదన్న

- కీర్తి గాంచిన సాహితీ కిరీటీ
- సాహిత్యం, రాజకీయం.. రెండు రంగాల్లో పేరొందిన కవి
- నేడు వానమామలై జయంతి



వానమామలై వరదాచార్యులు

చెన్నూర్: తెలుగు రాష్ట్రాల్లో సాహితీ రంగంలో వానమామలై వరదాచార్యులు కీర్తి గడించారు. ఓ వైపు సాహిత్యంలో, మరోవైపు రాజకీయంలో రాణించా రు. వరదన్న చేతి నుంచి జాలువారిన రచనలు ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్ఠలు తెచ్చిపెట్టాయి. వరదాచార్యులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పని చేశారు. నేడు వరదా చార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

జననం.. విద్యాభ్యాసం

వరదాచార్యులు వరంగల్ జిల్లా మడికొండలో 16 ఆగస్టు 1912లో సీతాంబ, బక్కయ్యశాస్త్రి దంపతులకు జన్మించారు. తండ్రి బక్కయ్యశాస్త్రి చెన్నూర్‌లో ఉపాధ్యాయునిగా పని చేశారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. వరదాచార్యులకు చదువు అబ్బలేదు. ఆయన సహజ కవి. 13వ ఏటా పద్యాలు, కవితలు, రచనలు ప్రారంభించారు.



వరదాచార్యులు కాలికి అప్పటి ప్రధాని పీవీ గండపెండేరం తొడుగుతున్న దృశ్యం

డిగ్రీలు లేని పండితుడు కావడంతో అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్‌లోని దోమకొండ జనతా కళాశాలకు సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. అనంతరం వానమామలై ఆంధ్ర సారస్వత పరిషత్‌లో విశారద రాసి ఉత్తీర్ణులయ్యారు. వరదాచార్యులు రాసిన ‘మణిమాల’ విశారద పరీక్షలో పాఠ్యాంశంగా ఉంది. అది చదివే పరీక్ష రాశారు. బాలల కోసం అనే బుర్రకథలు, నాటికలు రచించారు. దోమకొండ నుంచి చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ చేయించుకుని 1961 నుంచి 1972 వరకు విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు.

రాజకీయ ప్రస్థానంలో..

18 ఏళ్ల పాటు అధ్యాపకునిగా పని చేసిన వరదాచార్యులును అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం పీవీ నరసింహారావు 1972లో ఎమ్మెల్సీగా అవకాశమివ్వగా 1978 వరకు పని చేశారు. చెన్నూర్‌లో వేదపాఠశాల ఏర్పాటు చేసి అధ్యక్షునిగా పని చేశారు. 31 అక్టోబర్ 1984లో ఆయన తుదిశ్వాస విడిచారు.

కవి ప్రస్థానంలో..

చెన్నూర్ పట్టణానికి చెందిన వానమామలై వరదాచార్యుల 50 ఏళ్ల కవి ప్రస్థానంలో ఎన్నో రచనలు చేశారు. అభినవ పోతన, అభినవ కాళిదాసు, ఆంధ్రకవి, వసంత, మధుకవి, కవికోయిల, ఉత్ప్రేక్షా చక్రవర్తి, మహాకవి శిరోమణి, కవిశిరోవసంత లాంటి బిరుదులు పొందారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. షష్టిపూర్తి సందర్భంగా భారతీ సాహిత్య సమితి కరీంనగర్ జిల్లా కోరుట్లలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు గండపెండేరం, స్వర్ణకంకణం, రత్నాభిషేకం చేశారు. పూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం వారణాసి వారు విద్యావాచస్పతి (డిలిట్) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇలా అనేక రాష్ట్రాల్లో మరెన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన అనేక రచనలు ముద్రితం కాగా, కొన్ని ముద్రణకు నోచుకోలేదు.

నిందితుడి ఆచూకీ తెలిపితే నజరానా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 8న ఓ వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడి ఆచూకీ తెలిపిన వారికి భారీ నగదు బహుమతి ఇస్తామని డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునీల్‌కుమార్, నాగరాజుతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడి ఆమె మృతి కారణమైన నిందితుడు స్థానిక రైల్వేస్టేషన్ గుండా పర్లి వైద్యనాథ్ ట్రైన్‌లో పరారైన విషయం సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడి ఎత్తు దాదాపు 5.4 అడుగులు ఉంటుందని, మరాఠీ భాష మాట్లాడే వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితుడి వివరాలు తెలిస్తే ఆదిలాబాద్ డీఎస్పీని 8712659914, ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐని 8712659918, టూ టౌన్ సీఐని 8712659920, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను 8712659965 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడానికి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర, తెలంగాణలలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో నిందితుడిని పట్టుకుంటామని పేర్కొన్నారు. రూరల్ ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.